# పాపఫలం

శ్రీ కాజ వెంకటపద్మనాభరావు

ఆ తీక్షణమైన ఎండలో ఆమె గబగబ నడిచిపోతుంది. రేగిన వెంట్రుకలు కండ్లలో పడుతున్నాయి. నొసటనుంచిన కుంకుమ, చెమటకు చెరిగి నాసికొంతమువరకు జారింది. అపుడపుడు ఆమె వొడిలోనున్న బిడ్డను చూస్తుంది. నేత్రములనుండి జారిన నీటి బిందువులా బిడ్డపైబడి, వేడి గాలికి మాయమవుతున్నాయి. ఎదురు దెబ్బలకు కాలివేలు పగిలి రక్తం కార్తుంది. అది ఆమెకు తెలియదు. పోయి, పోయి, జైలుగేటుదగ్గర ఆగి ఎవరి కొరకో నిరీక్షిస్తూ నిలబడ్డది. రెప్పవాల్చక అలాగే చూస్తుంది. గంట గడిచింది.

'జయా! ఎంతసేపయింది వచ్చి?'

'ఇపుడే'

మాధవుడు చేతులను గేటు కడ్డీలగుండ పోనిచ్చి తనయుని అందుకున్నాడు. ఇనుప కడ్డీలు, చేతులను దహిస్తున్నాయి. అతనది తెలియుస్థితిలో లేడు. కుమారుని స్పర్శవల్ల తన్మయత్వం బొందాడు. బిడ్డను ముద్దుపెట్టుకో బోయాడు. కడ్డీల వేడికి బిడ్డ 'క్యావు' మన్నాడు. కడ్డీలమీద కోపంవచ్చింది. ఏమి చేయగలడు! తనయుని తల్లికిచ్చాడు.

జయ నేత్రములనుండి అశ్రువులు జల, జల, రాలుతున్నాయి. హృదయములోని దుఃఖ చిహ్నంగా, దుఃఖమును భర్తకు కనపర్చకూడదని ఎంతో ప్రయత్నం చేస్తోంది. అది హద్దుమీరి పొంగి పొరలి వచ్చేస్తుంది.

'జయా! భోం చేశావా?'

'ఆ!'

పాపం! భర్త విచార పడుతాడని అబద్ధమాడింది.

'చాల నీరసంగా వున్నావు!'

'ఏదో, కొంచెము ఎండకు......మీరు కులాస గదా?!

ఆమె కన్నులలో జాలి, ప్రేమ కనిపిస్తుంన్నాయి.

'ఆ! కులాసకేమి? రెండు పూటలా భోంచేస్తున్నాను. కాని...............'

అతని కన్నీరు చిక్కిన బుగ్గలలో ఆగిపోతున్నాయి.

'నాథా! అధైర్య పడకుడు. మనకీ కష్ట దినములు మంచి రోజులు వచ్చుటకే! ఓర్పు........'

'టైమయింది. అధికారి కోపిస్తాడు; రాండి' అని పోలీసు మాధవుని తీసుకు పోయాడు.

జయ అలాగేనుంచుంది ఎంతసేపో బరువైన హృదయాన్ని కదల్పలేక.

* * *

వారు పుణ్య దంపతులు. వారి ప్రేమ నిష్కళంకమయినది. అపారమైనది. చూచుటకు రెండు శరీరాలు; ఆత్మ ఒకటియే!! ఇద్దరు ఒకచో నుండునంతకాలము ఏ కష్టములు వారి నేమియు చేయజాలవు; వారి సౌఖ్యమునకు మేరలేదు. కాలము గడుస్తోంది. వారి ప్రేమ, పుత్రుని రూపముదాల్చింది; వారి ఆనందమునకు అంతులేదు.

వెల్తుర్ని వెన్నంటే వుంటుంది చీకటి. మాధవుడు చదువుకై అప్పుచేశాడు. బి. ఏ. ప్యాసయ్యాడు. ఉద్యోగంకోసం విశ్వప్రయత్నంచేశాడు; నిష్ఫలం అయింది. అప్పు తీర్చవలసి వొచ్చింది! ఉన్న ఆస్తి తిండికి సరిపోదు. అయితే ఎద్దుపుండు కాకికేమినొప్పి; ఋణదాత, మాధవుని ఆస్తిఅంతా అప్పుకింద లాక్కున్నాడు. ఇంకా కొదువవున్న బాకిని అతనిని ఖైదీ చేయించాడు. కపోతములు రెండూ విడిపోయినై!

* * *

అయ్యా! నా బిడ్డకు చాల జబ్బుగావుంది. భర్తను విడుదల చేయించండి'

'అది నాచేతులోలేదు; అప్పుతీరిన అతడే విడుదల కాగలడు,

'స్వామీ! వారు జైలులోవుంటే, అప్పు ఎలా తీర్తుంది? విడిపించిన ఎచటనో తల తాకట్టుపెట్టి అయినా మీ ఋణము తీర్చుకుంటాము. కరుణించండి!"

పాషాణమును సైతము కరగించు ఆ అబల జాలిమాటలు, చూపులు ఋణదాత కాఠిన్య హృదయాన్ని కరిగించ లేకపోయాయి. పాపము! జయ, ఆహారము లేక, నీరశించి భర్త ఎడబాటువల్ల కలిగిన దుఃఖాగ్నిలో కుమిలిపోతూంది. విషజ్వరము కుమారుని పీడిస్తుంది. మందు కొంటానికి రాగికాని అయినా చేతలేదు. కష్టదశలో ఋణదాతను ప్రాధేయపడుతోంది; కాని అతడు ఆమెను అర్థము చేసుకొనే స్థితిలోలేడు. డబ్బు మహాత్మ్యము! మీదు మిక్కిలి అతనికి కోపం హెచ్చవుతుంది.

'అయ్యా! మీ మేలు మరచిపోము. వ్యవధి యిచ్చిన మీ ఋణం ఉపవాసాలుచేసి అయినా తప్పక తీరుస్తాము బిడ్డకు ప్రాణం మీదికొచ్చింది. తండ్రికై తల్లడిల్లుతున్నాడు.........'

'అదేమియు నాకు తెలియదు. అప్పు తీరటం నాకు కావలసింది. ఇలాగోలపెడితే లాభంలేదు. పో అవతలకు'

దయారహితమైన అతని చూపులు ఆమె హృదయాన్ని భేదించుకు పోతున్నాయి. ఆమె వేదన అతనికితెలియదు. అది

రోజుక కర్కశ హృదయుడు; అతడు ధన మదాంధుడు. స్వల్ప అప్పు కోసం ఒక కుటుంబాన్ని నాశనముచేయ సమకట్టిన పాపభీతి రహితుడు.

'నాయనా! మీరు గొప్పవారు. నేనో పేదరాలిని; నిస్సహాయను. మీరు కోపిస్తే నేనేమి చేయగలను? దోవదిక్కు తెలియక అల్లాడి పోతున్నాను. ఈ స్థితిలో నాభర్త దగ్గర లేకపోయిన బిడ్డడు బ్రతుకడు. సంసారం కూలిపోతుంది. మీ అప్పు ఎక్కడికి పోదు. దయతలచి పుణ్యం కట్టుకోండి.'

“దయతలచిన అప్పు అప్పుగ వుండిపోయి అడుక్కో” తిన వలసి వస్తుంది. ఇపుడు మాకున్న పుణ్యంచాలు. ఇలా మొండి కేసి కూర్చుంటే బయటికి గెంటించవలసి వస్తుంది; ఆలస్యము చేయక పొమ్మ?

ఋణదాత లోపలికి పోయాడు. ఆశాభంగము ఆమె ముఖములో కనుపిస్తోంది. నీటి తెరలగుండ వాకిట్లోని పూలమొక్కలను అర్థం లేకుండా చూస్తోంది. ఆ క్రూరునకు భయపడి మొక్కలు వణుకుతున్నాదియు.... ఆమె లేచింది. పుత్రుని సంగతి జ్ఞాపకం వచ్చింది. పాపం! పసికూన ఎంత బాధపడుతున్నాడో! శక్తి లేక ఆమె మెల్లగ నడుస్తోంది వీధివంక చూస్తోంది. ఏమీ కనుపించటంలేదు. నిస్త్రాణ ఎక్కువైంది. కన్నులకు మైకం కమ్మింది. గేటుతగిలింది. స్పృహతప్పి కింద పడిపోయింది.

* * *

ఆవేళ ఆమె జైలువద్దకు చేరేటప్పటికి రెండుగంటలయింది. పొద్దున పదిగంటలకు యిల్లు వదలిపెట్టింది. బలహీనతచే సరియయిన వేళకు వెళ్ళలేకపోయింది. గేటువద్ద పోలీసును బతిమాలుకుంది భర్తను చూపమని.

“ఇపుడు వీల్లేదు; కావాలంటే సాయంకాలం వరకు వుండు” అన్నాడతడు.

ప్రాణావశిష్టయై ఆమె అలాగే గేటువద్ద కూలబడ్డది.

* * *

అతని చూపులు గేటువద్దకు పోయాయి. “జయా! జయా!” అంటూ పరుగెత్తాడు. ఆమె స్పృహలో లేదు. కంటి ధారచే ఆమె ముఖాన్ని కడిగాడు. గుడ్డతో విసిరాడు. కొంచెము సేపటికి ఆమె మెల్లగ కన్నులు తెరిచింది. ఒకప్పుడు నవ్వులు చిందులాడు ఆమె చూపులు, యిపుడు తేజో విహీనమై దుఃఖాన్ని వెలిపిస్తున్నాయి. అతని హృదయం మంచుగడ్డలాగ చల్లబడిపోయింది.

“జయా! జయా! కుర్రవాడేడి? జ్వరం ఎలా వుంది?”

”..............”

“నాయన కులాసా?”

“ఆ!.........”

“తీసుకొ రాలేదేమి?”

“జ్వరం యింకా వుంది; అంచేత తీసురాకులా.”

ఆమె, నాధుని సౌఖ్యంకొరకు ఏమైనా చెప్పగలదు; ఏదైనా చేయగలదు.

“జయా! నేను జైలులో వున్న ఖైదీని; నీవో జైలులో లేని ఖైదీవి. నేజేసిన అప్పుకు నేనుకాదు అనుభవించుచున్నది, నీవు. జయా! నీకష్టములు చూడలేకుండా వున్నా. నిన్ను రక్షించుటకు నేనసమర్థుడను; నిరుపయోగిని; నిరర్థక జీవిని.”

“నాథా! అట్లనకుడు; ఎన్ని కష్టములు వచ్చినను, మీ ముఖారవిందము చూచినంతనే, అవి పటాపంచలై పోతాయి; నాకై విచారింపకుడు. కష్టములు అశాశ్వితములు; మనకు మంచి రోజులొస్తాయి.”

మాధవుడు దీనుడై ఆమె ముఖం చూస్తున్నాడు. ఆమెలో ఓజోజ్యోతి అతనికి కనిపిస్తోంది.

“జయా! నీవు నాభార్యవగుట నిజముగ నాపుణ్యఫలం; నీ పాపఫలం.”

“మధూ!.........”

మాధవుని పోలీసు లాక్కెళ్ళాడు.

* * *

జయ రాత్రి పొద్దుపోయి యిల్లు చేరుకుంది. బలహీనతచే ఎన్నిసార్లు కిందపడ్డదో ఆమెవంటిమీదిగాయములే సాక్షి. ఇల్లు చూస్తే భయంవేసింది ఆమెకు. తనముద్దు బిడ్డను పొట్టపెట్టుకుంది ఆ యిల్లే! అంధకార మయమైన ఆ యింట్లో ఆమెకు తనయుని చిరునవ్వుచే వచ్చు వెలుగు కనుపిస్తోంది. అతని ముద్దుమాటలు నిశబ్దాన్ని భంగము చేస్తున్నాయి. ఆమెకు ఎక్కడలేని ఓపికవచ్చింది. పుత్రాన్వేషణార్థమై యిల్లంతయు తిరిగింది. ఆ గాఢాంధకారములో, తల గోడకుతగిలి రక్తము కారుతుంది. ఆ నొప్పికి ఆమెకు తెలివివచ్చింది. భ్రమని తెలుసుకొని మిక్కిలి ఆశాభంగము పొందింది. స్మశానంలో వున్నట్లు ఆమె భయపడ్డది. ఆమెకు ధైర్యము యిచ్చువారెవ్వరు లేకపోయ్యారు.

* * *

నాలుగుదినాలు గడిచాయి. మాధవును జైలునుండి వొదిలిపెట్టారు-ఆరు నెలలు గడిచాయి అని. చాల బలహీనముగ వున్నాడు పాపం! దుఃఖములలో తిండేమి తినగలడు? ఎప్పుడు భార్యా పుత్రులను కలుసుకొందునా అని ఆత్రుతతో యిల్లుచేరాడు. ఇల్లు కళావిహీనమై పాడుబడ్డట్టు వుంది. ఒక, కుక్కిమంచములో నుండి మూల్గులు హీనస్వరముతో వినిపిస్తున్నాయి.

“జయా! జయా!”

అతనిగుండె పగిలిపోయింది. ఇద్దరిచూపులు ఏకమయ్యాయి. ఆమె నోటమాటలేదు. కన్నులనుండి కారింది తుదిజలం. నల్లగుడ్లు తెల్లగా మారిపోయాయి. మూల్గులు ఆగిపోయాయి.

అతడు స్తంభితుడై అలాగే వుండిపోయాడు. మరుక్షణంలో అతని వేడిరక్తం పొంగింది; మితిలేని బలంవచ్చింది. గుడ్లు చింత నిప్పులులాగ మెరిశాయి. ధైర్యం. సాహసం అతని ముఖంలో తాండవిస్తున్నాయి. గోడనున్న బాకుతీసి యింటిలో నుండి బయటి ఓ గంతేశాడు.

ఒకప్పుడు పాపఫలం వెంటనే కనిపిస్తోంది.